కథలు: గాథలు:

# గరికవలస

వర్షాకాలం. ఈఇంటిమీది కాకి ఆఇంటిమీదికి వెళ్లలేదు. ముసురు. రెండురోజులై కొంచెము తెరిపియిస్తోంది. కోడి పందాలు; పొట్టేళ్ళపోట్లాటలు; పులితో కుస్తీలు; గరిడీసాములు మొదలైన విద్యలు జరగడం మొదలెట్టేయి. బోనులో పులిని వదలి కుస్తీపడుతూ ఉండే రోజులు. అందుచేత పులివేట ఎక్కువగా ఉండేది.

వర్షం వచ్చినదగ్గరనుంచి రాజుగారికి కొంచెం సుస్తీగా ఉంది. ఆరోజునే దర్బారు తీర్చిఉన్నారు. ఆయన పులి వేటలో నేర్పరి.

"మహాప్రభూ! నే నొక జ్యోతిష్కుణ్ని."

"ఇప్పుడు అవుసరం లేదు. కందాలో భోంచేస్తూ ఉండండి."

"వైద్యరత్నంగారు శరీరానికి కేవలం మందులే కావాలంటారా?" అని రాజుగారు అడిగేరు.

"అవును. అందులోనూ వనమూలికలతో తయారుచేసే మందు గుణం—పిలిస్తే పలుకుతుంది. ప్రాణం పోతూన్నవారికి యివ్వగా బాగైనవా రున్నారు. సంజీవకరణి, సంధానకరణి అమోఘమైన వనమూలికలు."

"వుపవాసం వుంటే ఏమందూ అక్కరలే దంటారు."

"అది అలవాటు చేసుకుంటే అక్కరలేదు."

"పరిపాలన ఉపవాసంతో సాగుతుందా?"

"తమబోటివారికి కాదు. ఉపవాసము అంటూ. రేపుకూడా నిరాహారంగా ఉంటే మంచిది, ఎల్లుండినుంచి భోజనం చెయ్యవచ్చు. వర్షం తగ్గుతుందని పంచాంగంలో ఉంది" అన్నారు వైద్యరత్నంగారు.

"వర్షం తగ్గకపోతే ఉపవాసమేనా" అన్నారు రాజుగారు.

రత్నంగారు ఏదో చెప్పబోయేరు.

రాజుగారు వినిపించుకోక, సిద్ధాంతిగారితో—"ఏమండీ! నేను రేపు అన్నం తింటానా? లేదా?"

"పొడన్నము—పచ్చడి తింటారు ప్రభూ!"

కోపం వచ్చింది రాజుగారికి. "నిజం కాకపోతే మీకు శిక్ష—"

"శాస్త్రం అబద్ధం కాదు ప్రభూ!"

వంటవాణ్ని పిలిపించి తొమ్మిది పిండివంటలు చెయ్య మన్నారు.

తెల్లవారింది. కొంచెం వర్షంగా ఉంది. పశువులను పైని కట్టిఉండగా పెద్దపులి ఒకటి వచ్చి ఒక పశువును ఎత్తుకుపోయింది అని మిరపకాయటపాద్వారా ఫిర్యాదు వచ్చింది.

రాజుగారు బయలుదేరడానికి సిద్ధంగా ఉన్నారు. గాలి సాగింది. రాజుగారికి పట్టుదల ఎక్కువైంది. ఇరవైమైళ్ళ దూరం అడవి. దారంతా వెతికిస్తూ అడవి చేరేరు. వర్షం ఎక్కువైంది. డప్పులు కొట్టించారు. పులి కనిపించింది. వెంబడించారు రాజుగారు. వర్షం జోరైంది. పులిని తరుముతూ ఉన్నారు రాజుగారు. ఎంతదూరం వెళ్ళిందీ తెలియలేదు. మనిషీ మనిషీ కనిపించడం లేదు. సర్దారును కేకేసేరు. అందలేదు. పచ్చగా పులి కనిపించింది. కొట్టేరు—మీదికి రాబోయింది దెబ్బ బాజూటయి. తప్పించుకొని మళ్ళా కొట్టారు. కింద పడ్డది. కనుచూపుమేర ఏమీ కనిపించలేదు. కొంతసేపు నడిచి ఆయాసంతో ఒక చెట్టుక్రింద కూర్చున్నారు. నిద్ర పట్టింది. కొంతసేపటికి తెలివొచ్చింది. వర్షం వెలిసింది. ఆకలి తీవ్రంగా ఉంది.

సూర్యబింబంకోసం చూచేరు. రాత్రికి ఝాముంది. లేచి కొంతసేపు నడిచేరు. దూరాన గుడిసెలు కనపడ్డాయి. ఆయాసంతో బయలుదేరేరు.గుడిసెలో దూరి—"అవ్వా! ఆకలి వేస్తోంది—వేటకు వచ్చేను. పులి చచ్చింది." అన్నారు.

"బతికేము—నీకడుపు చల్లగ—నీయిల్లు వెయ్యిళ్ళ మొదలై...." అంటూ, "మూడుగంటలైంది—పొద్దుట పది గంటలకి వండిన వంట—" అని చెప్పుతూ—"ఒట్టి అన్నము ఎలాగ పెట్టను" అనుకొని, "గరికె చిగుళ్లు ఒంటికి మహ శాంతి అని వేదాల్లోకూడా చెప్పేరు అని మావారు పచ్చడిచేయించుకొని తినేవారుకదా" అని వెంటనే గరికచిగుళ్లు తెచ్చి పచ్చడి చేసిపెట్టింది.

రెండు కబళాలు తిన్నారు. హైరాణా తగ్గింది. సిద్ధాంతిగారి మాటలు జ్ఞాపకం వచ్చి పక్కున నవ్వుకున్నారు.

"ఎందుకు నవ్వుతున్నావు? పచ్చడి బాగులేదా? ఏమీ లేక గరికాలు తెచ్చి పచ్చడిచేసేను."

రాజుగారికి ఆశ్చర్యం, అభిమానం రెండూ కలిగేయి. అవ్వఆదరానికి మురిసిపోతున్నారు.

ఇంతట్లోకి రాజుగారి సేన వెతుక్కుంటూ వచ్చింది.

అవ్వ కొయ్య అయిపోయింది. అంతా బయలుదేరేరు దేవిడీకి. సిద్ధాంతిగారికి గొప్ప బహుమానం ఇచ్చి ఆస్థానవిద్వాంసులుగా నియమించేరు.

అవ్వకి ఒక మాన్యం యిచ్చేరు. దానికి "గరికవలస" అని పేరు పెట్టేరు. ఇప్పటికీ అదే వాడుక.

నిడుదవోలు సూర్యనారాయణ.